క్లుప్తంగా

వలంటీర్లపై దాడులు ఆపాలని ఆందోళన



ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న వలంటీర్లు

రావికమతం: సేవా భావంతో గ్రామాల్లో పనిచేస్తున్న తమపై భౌతిక దాడులు నియంత్రించాలని కోరుతూ మండల వలంటీర్లు శనివారం రావికమతంలో ఆందోళన చేపట్టారు. బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురంలో ఇంటి పన్ను అడిగిన వలంటీర్ పడాల శివపై మాజీ సర్పంచ్ సత్యనారాయణ, అతని అనుచరులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి దాడులు మరెక్కడా పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలంటూ ఎంపీడీవో వెంకన్నబాబు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావులకు వినతి పత్రాలు అందించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న సర్పంచ్ రవికుమార్

రావికమతం: కొమిర గొల్ల చెరువులో ఉపాధి వేతనదారులకు గ్రామ సర్పంచ్ గొర్లె రవికుమార్ శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఇక్కడ చెరువులో వారం రోజులుగా పలు గ్రూపులకు చెందిన వందలాది మంది కూలీలు పనులు చేస్తున్నారు. వారం రోజులుగా ఎండలు తీవ్రత దృష్ట్యా మజ్జిగ అందించారు.

18న వీరాంజనేయ స్వామి తీర్థం

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు, ఎం.కె.వల్లాపురం గ్రామాల ఆరాధ్య దైవం వీరాంజనేయ స్వామి తీర్థం ఈ నెల 18వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తీర్థం గోడపత్రికను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం తారువ క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఎం. కె. వల్లాపురం ఉప సర్పంచ్ కరణం రాము, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న డేన్ ఫౌండేషన్ సభ్యులు

కె.కోటపాడు: గరుగుబిల్లికి చెందిన పాతరపల్లి దేముడు చేపడుతున్న ఇంటి నిర్మాణానికి డేన్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు రూ.10 వేలు అందించారు. దేముడుకు భార్యతోపాటు ఏడుగురు కుమార్తెలు ఉన్నారు. వీరి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో ఈ నగదును ఫౌండేషన్ సభ్యులు శనివారం అందించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, అప్పలనాయుడు, గోవింద పాల్గొన్నారు.

పాస్టర్లకు ఘన సన్మానం



పాస్టర్లను సత్కరిస్తున్న కోర్ కమిటీ ప్రతినిధులు

నర్సీపట్నం: చెన్నై హెచ్‌సీఎఫ్ యూనివర్సిటీ, గ్లోబల్ వాలింజికల్ యూనివర్సిటీల నుంచి బిషప్ పట్టా పొందిన ఏ.డానియేల్, పి.బెంజిమెన్‌లను పెదబొడ్డేపల్లి ఫ్లోయింగ్ స్ప్రింగ్స్ ప్రార్థనా మందిరంలో జిల్లా కోర్ కమిటీ వారు శనివారం ఘనంగా సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు వై.సూర్యప్రకాష్, కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, ఫ్లోయింగ్ స్ప్రింగ్స్ ప్రార్థనా మందిరం డైరెక్టర్ మార్లపూడి కొండలరావు ఉన్నారు.

ఎండలకు బెంబేలు

మాడుగుల రూరల్: వేసవి ఎండల తీవ్రతకు జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 8 గంటలకే ఉపాధి వేతనదారులు, వ్యవసాయ కూలీలు వేగంగా పనులు ముగించుకుని నీడకు చేరుతున్నారు. గతేడాది కంటే ఈ మాసంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయట తిరగడం లేదు. ఇళ్లకే పరిమితమవుతున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

చోడవరం ఏడీఏ రవీంద్రనాథ్



దేవరాపల్లి: మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవీంద్రనాథ్



నర్సీపట్నం: భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏవో అప్పారావు



మాకవరపాలెం: తామరంలో మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇస్తున్న ఏవో

దేవరాపల్లి: ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకునేలా అవగాహన కల్పించాలని చోడవరం ఏడీఏ వి. రవీంద్రనాథ్ సూచించారు. ఏవో వై. కాంతమ్మ అధ్యక్షతన తారువ రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈవోలతో మట్టి నమూనాల సేకరణ, వాటి ఆవశ్యకత, తీసే విధానంపై శనివారం మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం ద్వారా ఏ పంటల సాగు చేయాలి, ఎరువులు ఎంత మోతాదులో వేయాలి, తదితర అంశాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ విషయాలను క్షేత్ర స్థాయిలో రైతులకు సమగ్రంగా వివరించాలన్నారు.

మాకవరపాలెం: అన్ని గ్రామాల్లోనూ త్వరలో మట్టి నమూనాల సేకరణ ప్రారంభిస్తామని ఏవో చిరంజీవిరావు తెలిపారు. శనివారం తామరంలో సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లకు మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. పీఏసీఎస్ డైరెక్టర్ ద్వారపురెడ్డి అయ్యన్న, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం: భూసార పరీక్షలపై సిబ్బంది సమగ్ర అవగాహన కలిగి ఉండాలని ఏవో అప్పారావు సూచించారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వినియోగించాల్సి ఉన్నందున సకాలంలో మట్టి నమూనాలను సేకరించి రైతులకు ఫలితాలు ఇవ్వాలని సూచించారు.

కె.కోటపాడు: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పొలం సారవంతంగా తయారీ చేయాలని ఏవో సోమశేఖర్ తెలిపారు. మేడిచర్లలో వ్యవసాయశాఖ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో మట్టినమూనాలను సేకరించి, ఏ విధంగా ల్యాబ్‌కు పంపించాలో వివరించారు. ఏఈవో లైలాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ప్రతి రైతు పంటలు వేయడానికి ముందుగా మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల సూక్ష్మ, స్థూల పోషకాలు లభ్యతను తెలుసుకోవచ్చునని ఏవో ఎం. వాసుదేవరావు పేర్కొన్నారు. కె.జె.పురంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ సహాయకుల శిక్షణలో ఆయన మాట్లాడారు. మరో నెల రోజుల్లో తొలకరి ప్రారంభం కానుందని, గ్రామాల్లో రైతులకు మట్టి పరీక్షలుపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారులు డి. సత్యనారాయణ, జగన్నాథరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

● నీలంపేటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆర్డీవో జయరాం



నర్సీపట్నం: అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరాం



పి.కె.గూడెం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి



కె.కోటపాడు: ఆర్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

నర్సీపట్నం: గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం లబ్ధిదారులకు సూచించారు. నీలంపేట జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతిని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను చైతన్యపరిచి త్వరగా పూర్తి చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో జయమాధవి ఉన్నారు.

నాతవరం: మండలంలో పి.కె.గూడెం, గునుపూడి, పెద గొలుగొండపేట గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శనివారం మండల ప్రత్యేకాధికారి జి.వెంకటలక్ష్మి పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అచ్చెర్ల వరహాలబాబు, సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు, జేఈలు వెంకటేశ్వరమ్మ, జోగారావు, రాజేష్, ఉపాధి ఏపీవో చిన్నారావు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు: మండలంలో ఆర్లి, కింతాడ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని బట్టి బిల్లులు సకాలంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో శచీదేవి, హౌసింగ్ ఏఈ రవిబాబు, సర్పంచ్‌లు బండారు ఈశ్వరమ్మ, బోళం సందీప్, మండల ఇంజినీరింగ్ అధికారి బాలాజీ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, అనురాధ పాల్గొన్నారు.

మాకవరపాలెం: స్థానిక జగనన్న కాలనీని ఎంపీడీవో అరుణశ్రీ శనివారం సందర్శించారు. ఇంకా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రానివారితో మాట్లాడారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభించేలా సచివాలయ, సిబ్బంది, వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణ శాఖ జేఈ రామలింగస్వామి, పంచాయతీ ఈవో సుదర్శనరావు, వెలుగు సీసీ శ్రీరామ్ ఉన్నారు.

మాడుగుల రూరల్: హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని జంపెన, ఎం. కృష్ణాపురం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో పి.ఎస్.ఎల్.మీనాకుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ శనివారం పరిశీలించారు. వీటిని వేగవంతం చేయాలని సూచించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది



ఎస్ మార్టు ఉద్యోగులతో ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ అవరణలో శనివారం అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపు చేయడాన్ని క్షేత్రస్థాయిలో చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ అధికారి పి.ఎ.స్వామి మాట్లాడుతూ ప్రమాదం సంభవించినప్పుడు సకాలంలో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

చోడవరం రూరల్: స్థానిక ఎస్ మార్టులో శనివారం అగ్ని ప్రమాద నివారణ జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ పి.వి.రామస్వామి నేతృత్వంలోని అగ్నిమాపక దళ సిబ్బంది ప్రమాదాలు నివారించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ప్రమాద సమయంలో పాటించాల్సిన చర్యల గురించి ప్రదర్శన ద్వారా తెలియజేశారు. ఈ మేరకు కరపత్రాలను సిబ్బందికి, వినియోగదారులకు, ఆర్టీసీ కాంప్లెక్సులోని ప్రయాణికులకు పంపిణీ చేశారు.

34 మంది దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్

రావికమతం: మండలంలో 9, 10 తరగతులు చదువుతున్న 33 మంది దివ్యాంగ విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలు మంజూరైనట్టు ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మీనాయుడు, జగన్నాథనాయుడు శనివారం తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికిగాను శారీరక దివ్యాంగ విద్యార్థులకు రూ.9 వేలు, మానసిక, దృష్టిలోపం వారికి రూ.11 వేలు, కేజీబీవీలో చదివే దివ్యాంగ బాలికలకు రూ. 14,600 చొప్పున మొత్తం 33 మందికి రూ.3,54,600 మంజూరైందన్నారు. ఇప్పటికే వారి ఖాతాల్లో జమైనట్టు తెలిపారు. జిల్లాలో రావికమతం మండలానికే అత్యధికంగా 33 మందికి మంజూరైనట్టు వివరించారు.

సంక్షేమ పాలనకు నాంది



మాడుగుల: ఒమ్మలిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు



నర్సీపట్నం: కరపత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్ జగదీశ్వరి



గొలుగొండ: అడ్డలోవలో ప్రచారం చేస్తున్న దృశ్యం



మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో కరపత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కొండలరావు

గొలుగొండ: నేరుగా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరుతూ శనివారం పుత్తడిగైరంపేట, కంటారం పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు పత్తి రమణ, బిడిజాన రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో 98 శాతం పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయని వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గృహ సారథులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: జగనన్నే మా భవిష్యత్తులో భాగంగా మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు ఎం. కోటపాడులో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో అందిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఆనందపురంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్, వలంటీర్లతో కలిసి సర్పంచ్ వంటాకు అప్పాజి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పాలన, అభివృద్ధిని వివరించారు. చంద్రబాబు పాలనలో ప్రజలను మోసం చేసిన తీరును తెలిపారు. మాజీ సర్పంచ్ గురు బంగారునాయుడు, మాజీ ఉప సర్పంచ్ వంటాకు మహేష్ పాల్గొన్నారు.

మాడుగుల: జగనన్న మా భవిష్యత్తులో భాగంగా ఒమ్మలిలో సచివాలయ కన్వీనరు పూసర్ల రామలక్ష్మి, వార్డు సభ్యులు పూసర్ల వెంకటరావు సారథ్యంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. వార్డు సభ్యులు దండుపాటు రమేష్, పాల సంఘం డైరెక్టరు గుమ్మాల చంద్రరావు, నాయకులు తాటికొండ వెంకట్రావు, నర్సింహమూర్తి, కాతా వెంకటరమణ, పూసర్ల వెంకట్రావు, పర్రె ఏసుబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం: మున్సిపాలిటీ ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వలంటీర్లు, గృహసారథులతో కలిసి 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ రాజీనామాలకు ఆమోదం

అర్థాంతరంగా ముగిసిన నర్సీపట్నం కౌన్సిల్ సమావేశం



చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

నర్సీపట్నం: ఎజెండాలోని అంశాలపై చర్చ జరగకుండానే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అర్థాంతరంగా ముగిసింది. అయితే సభ్యుల అభ్యంతరాలు, నిరసనల మధ్య పురపాలక చట్టం 1965 సెక్షన్ 55 మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి గుడబండి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ పదవికి గొలుసు నర్సింహమూర్తి సమర్పించిన రాజీనామాలతోపాటు ఎజెండాలోని అంశాలను ఆమోదించామని చైర్‌పర్సన్ ప్రకటించారు. చైర్ పర్సన్ ఆదిలక్ష్మి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. తొలుత ఎజెండాలోని అంశాలను కౌన్సిల్ ముందుంచేందుకు మున్సిపల్ సిబ్బంది సిద్ధమయ్యారు. ఇంతలో టీడీపీ కౌన్సిల్ చింతకాయల పద్మావతి అభ్యంతరం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ రాజీనామా చేసిన తర్వాత ఎజెండాపై సంతకం ఎలా చేస్తారని ప్రశ్నించడంతోపాటు రోడ్డు విస్తరణ బాధితులకు నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ కనకారావు కల్పించుకుని వివరణ ఇస్తుండగానే ఎజెండాలో అంశాలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామంటూ టీడీపీ కౌన్సిలర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత సభలో మున్సిపాలిటీ అవినీతిమయమైందని జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య ఆరోపించారు. ఈ క్రమంలో అధికార పక్ష కౌన్సిలర్లు సైతం సభ నుంచి బయటకు వెళ్లిపోగా, కొద్ది నిమిషాల వ్యవధిలోనే సమావేశం ముగిసింది.

ఎజెండాలోని అంశాలు...

పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణకు సంబంధించి కొందరు కోర్టును ఆశ్రయించారని, పురపాలక సంఘం తరపున కేసు వాదించుటకు న్యాయపరమైన ఖర్చుల కోసం రూ.49,500 అనుమతి కోరుతూ ఎజెండాలో చేర్చారు. కలెక్టరు ఆదేశాల మేరకు అబిద్ సెంటర్, ఎల్‌ఐసీ ఆఫీస్, ఐదు రోడ్ల జంక్షన్, ఏరియా ఆస్పత్రి, పెదబొడ్డేపల్లి జంక్షన్‌లో చలివేంద్రాల ఏర్పాటుకు కౌన్సిల్ ముందుంచారు. వేసవి దృష్టిలో పెట్టుకుని పుర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో నీటి నిల్వల పెంపునకు అవసరమైన నిధులు మంజూరుకు, ప్రైవేటు ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా చేయాలని ఎజెండాలో పొందుపరిచారు. వీటితోపాటు ఎజెండాలోని పలు అంశాలను పొందుపరిచి ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



కె.జె.పురం పరీక్ష కేంద్రం నుంచి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



తెనుగుపూడి గురుకుల నుంచి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థులు

మాడుగుల రూరల్/దేవరాపల్లి/రోలుగుంట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు పటిష్టమైన బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించారు. మాడుగుల మండలంలోని కె.జె.పురం, ఒమ్మలి జెడ్పీహెచ్‌ఎస్‌తోపాటు, మాడుగుల జెడ్పీ హైస్కూలు, ఆర్సీఎం బాలికల పాఠశాల, తాటిపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో దేముడమ్మ తెలిపారు. ఆఖరి రోజు సోషల్ స్టడీస్ పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులు ఆనందంతో కేంద్రాలు నుంచి బయటకు వచ్చారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెనుగుపూడిలోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో పలువురు విద్యార్థులు విక్టరీ సింబల్ చూపిస్తూ సందడి చేశారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 350 మంది విద్యార్థులు చివరి రోజు హాజరయ్యారు. చీఫ్‌గా సత్యారావు, డీవోగా దాడిశెట్టి రమేష్‌కుమార్ వ్యవహరించారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

సీనియర్ సివిల్ జడ్జి లీలావతి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

నర్సీపట్నం: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలు ఉచిత న్యాయసేవలు పొందవచ్చనని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి పేర్కొన్నారు. స్థానిక సబ్ జైల్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జైల్‌లో నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏదైనా నేరంలో ఒక్కసారి జైల్‌కు వచ్చిన తర్వాత పరివర్తన రావాలన్నారు. పదే పదే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాది పి.నాగేశ్వరరావు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే సేవలు గురించి వివరించారు.

నేటి నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్

చోడవరం రూరల్: ప్రేమ సమాజంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్, ఏపీఆర్‌జేసీ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. పూసర్ల సంతోష్‌కుమార్, రామలక్ష్మిల నేతృత్వంలో ఈ శిక్షణా తరగతులను ఆదివారం నుంచి ప్రారంభించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు హాజరు కావావాలని ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, ప్రేమ సమాజం ప్రతినిధి ప్రసాదరాజు, విశ్రాంత ఆర్జేడీ తిరుపతిరావు కోరారు. ఈ మేరకు కరపత్రాలను శనివారం వారు విడుదల చేశారు. చిత్రకళా నిలయం వ్యవస్థాపకుడు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి వి.వి. అగ్రహారంలో..

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో ఈ నెల 17వ తేదీ నుంచి పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ సమన్వయకర్తలు కె.జానీ, ఆర్. రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 65 మంది విద్యార్థులకు వచ్చే నెల 8వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ఆచార్యులు జోగారావు



సదస్సులో మాట్లాడుతున్న జోగారావు

అనకాపల్లిటౌన్ : యువత ఆర్థికంగా అభివృద్ధి చెంది, ఉన్నతస్థాయిలో రాణించేందుకు నైపుణ్యంతో కూడిన విద్యాప్రమాణాలు అలవర్చుకోవాలని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ఆచార్యులు జోగారావు అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు మనోవికాస కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య అంటే చదువు మాత్రమే కాదని, అనేక రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండడమేన్నారు. తద్వారా తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నతస్థాయికి చేరుకోగలుగుతారని తెలిపారు. 10వ తరగతి తర్వాత విద్యార్థులకు పాలిటెక్నిక్, వ్యవసాయ పాలిటెక్నిక్ వంటి నైపుణ్యతల విద్య అందుబాటులో ఉందని, ఆ దిశగా ప్రయత్నించాలని సూచించారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కోర్స్‌లో విద్యనభ్యసించిన యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్ట్స్, కామర్స్ రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బొజ్జన్నకొండను దర్శించుకున్న బౌద్ధ భిక్షువు

అనకాపల్లిటౌన్ : బొజ్జన్న కొండను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని బర్మా బౌద్ధ భిక్షువు వెనరబుల్ ఆయుపాల్ మహాథేరో భాంతేజి అన్నారు. శంకరం వద్ద నున్న ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండను శనివారం ఆయన సందర్శించి ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొండ చరిత్రను అడిగి తెలుసుకున్నారు.